
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 20 జనవరి 2025

ఎలిగేడు పోలీస్ స్టేషన్ ప్రారంభమెప్పుడో?
● ఉత్కంఠగా ఎదురుచూస్తున్న మండల ప్రజలు
● ముమ్మరంగా కొనసాగుతున్న మరమ్మతు పనులు
8
పేదలకు ఉచిత విద్యనందించడమే లక్ష్యం
● వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి
● పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

అర్హులైన వారి రేషన్ కార్డులు తొలగించం..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని, రేషన్ కార్డులను తొలగించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే విజయరమణారావు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, అయినా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రజలు నమ్మొద్దని హెచ్చరించారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని, కొత్త రేషన్ కార్డుల జారీలో మరెవరివో కార్డులు తొలగిస్తామనే ప్రచారం సరికాదన్నారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను అమలుచేస్తుంటే బీఆర్ఎస్ బీజేపీలు అక్కసు వెళ్లగక్కుతున్నాయన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే తెల్లారిలేచింది మొదలు హరీష్‌రావు, కేటీఆర్‌లు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని అన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డు జారీ చేస్తారని, ఇందుకు అధికారులు గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలపై సమగ్ర సర్వే చేస్తున్నారన్నారు. దాంతోపాటు ప్రతీ ఒక్కరికి కార్డు ఇవ్వడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. పేదలందరికీ కార్డులు అందుతాయని, ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. జనవరి 26 నుంచి ప్రభుత్వం మరో నాలుగు కొత్త పథకాలు కార్యక్రమాలు అమలు చేయనున్నదని, ఇలా అనేక సంక్షేమ పథకాలతో ప్రభుత్వం ముందుకుపోతుంటే బీఆర్ఎస్ వారు ఎందుకు రాస్తారోకోలు ఆందోళనలు ధర్నాలు చేస్తున్నారో తెలియడం లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, ఈర్ల స్వరూప, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండానే వ్యాపారాలు

● రామగుండంలో పది పెట్రోల్ బంక్‌లకు నిర్మాణ అనుమతుల్లేవు..
● అనుమతి లేని వాణిజ్య సంస్థలపై కార్పొరేషన్ కొరడా
● తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రయోగం
● మూడు పెట్రోల్ బంక్‌లు, 14 రెస్టారెంట్లకు నోటీసులు
● ఇప్పటికే 8 ఫంక్షన్ హాల్స్‌కు పెనాల్టీ నోటీసులు



కోల్‌సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొన్ని వాపార సంస్థలు ఎలాంటి అనుమతులు లేకుం డానే తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. నిర్మాణ అనుమతులు లేకుండానే పెట్రోల్ బంక్‌లు నిర్మించి దశాబ్దాలుగా వ్యాపారాలు చేస్తు న్నారు. కార్పొరేషన్‌కు కోట్ల రూపాయల ఫీజులను ఎగ్గొడుతున్నారు. ఇటీవల అనుమతి లేని ఫంక్షన్‌హాల్స్‌కు నోటీసులు ఇచ్చిన కార్పొరేషన్ ఇప్పుడు పెట్రోల్ బంక్‌లు, మాల్స్, రెస్టారెంట్లపై దృష్టి పెట్టింది. అనుమతి లేని నిర్మాణాల్లో వ్యాపారం చేస్తున్న సంస్థలపై తెలంగాణ మున్సిపల్ చట్టం 2019ని ప్రయోగిస్తోంది. ఈ మేరకు పెనాల్టీ నోటీసులు జారీ చేసింది.

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 14పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. వీటితో పాటు ఎన్‌టీపీసీ, సింగరేణి సంస్థల అవసరాలకు ప్రత్యేకంగా బంక్‌లు ఉన్నాయి. సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, కేశోరాం పరిశ్రమలకు ప్రతి రోజు వేల సంఖ్యలో ట్రాన్స్‌పోర్ట్ వాహనాల వినియోగం ఉంటుంది. ఇక్కడి సింగరేణి ఉత్పత్తి అవసరాలు, పరిశ్రమల అసరాలకు ప్రతిరోజు వేల లీటర్ల డీజిల్, పెట్రోల్ వినియోగిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో 2.5లక్షల జనాభా ఉంది. బంక్‌ల్లో కోట్ల రూపాయల వ్యాపారం సాగుతుంది. సాధారణంగా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు సమయంలో వివిధ రకాల అనుమతులు తీసుకుంటారు. ఇందులో మున్సిపల్ అనుమతి తీసుకున్న తరువాతే నిర్మాణం జరపాల్సి ఉంటుంది. పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా ఆయా పెట్రోలియం సంస్థలకు దరఖాస్తు చేసుకుంటారు. ఐవోసీ, హెచ్‌పీ, ఇండియన్ ఆయిల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలకు డీలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారులకు డీలర్‌షిప్‌కు సంబంధించి అంగీకార పత్రాలను ఆయా సంస్థలు ఇస్తాయి. తరువాత పోలీస్, ఫైర్, రెవెన్యూ ఇతర విభాగాల నుంచి ఎన్‌వోసీతో పాటు ఆయా బంక్‌లు నెలకొల్పే ప్రాంతాల్లో స్థానిక సంస్థల నుంచి నిర్మాణ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో కలెక్టర్లు, పోలీస్ కమిషనరేట్‌లు ఉన్న ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్లకు సంబంధిత పత్రాలను ఆయా సంస్థలు పంపుతారు. అన్ని ఎన్‌వోసీలతో పాటు స్థానిక సంస్థల అనుమతి పత్రాలు ఉన్న తరువాతే కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు బంకుల ఏర్పాటుకు క్లియరెన్స్ ఇస్తారు.

● మొన్న ఫంక్షన్‌హాళ్లు... నేడు పెట్రోల్ బంక్‌లు, రెస్టారెంట్లు

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కార్పొరేషన్ నిర్మాణ అనుమతులు లేకుండా వ్యాపారాలు సాగిస్తున్న వాణిజ్య సంస్థలపై దృష్టి పెట్టిన కార్పొరేషన్ ఈ మేరకు విచారణ జరుపుతోంది. ఇప్పటికే గత నెలలో 8ఫంక్షన్‌హాల్స్‌కు పెనాల్టీ నోటీసులు ఇచ్చింది. ఒక్కో ఫంక్షన్‌హాల్ విస్తీర్ణం బట్టి రూ.35లక్షల నుంచి రూ.84లక్షల వరకు ఈ పెనాల్టీలు జారీ అయ్యాయి. సుమారు రూ.5కోట్లు పెనాల్టీ ఫీజు చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పుడు పెట్రోల్ బంక్‌లకు పెనాల్టీ నోటీసులు జారీ అయ్యాయి. మూడు బంక్‌లకు పెనాల్టీ నోటీసులు జారీ చేసిన కార్పొరేషన్ ఇతర బంక్‌లకు కూడా నోటీసులు ఇచ్చింది. కేవలం మూడు బంకులకు మాత్రమే అనుమతులు ఉన్నట్టు వ్యాపారులు పత్రాలు సమర్పించినట్టు తెలుస్తుంది. వీటితో పాటు కార్పొరేషన్ పరిధిలోని 13 రెస్టారెంట్‌లకు నోటీసులు ఇచ్చారు. ముఖ్యంగా ఎన్‌టీపీసీ పరిధిలోని రెస్టారెంట్‌లలో నిర్మాణం అనుమతులకు సంబంధం లేకుండా భవనాలు నిర్మించి రెస్టారెంట్లు నిర్వహిస్తున్నట్టు కార్పొరేషన్ గుర్తించింది. ఈ రెస్టారెంట్ల భవన యజమానుల సమాధానాలను బట్టి పెనాల్టీలు జారీ అయ్యే అవకాశం ఉంది.

● మూడు పెట్రోల్ బంక్‌కు పెనాల్టీ నోటీసులు

రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో నిర్మాణ అనుమతులు లేకుండానే వ్యాపారులు పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తున్నారు. కేవలం

మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

ఆర్థిక చేయూత

కోల్‌సిటీటౌన్,జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన బండారి సంతోష్ కుటుంబానికి వీహెచ్ఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. సంతోష్ పిల్లల భవిష్యత్‌లో చదువుకు చేయూనిచ్చేందుకు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ళ హరీష్ రెడ్డి హామీ ఇవ్వగా ఆదివారం పిల్లల చదువుకు రూ.30వేలు ఆర్థికసాయాన్ని సంతోష్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ పార్టీ 40వ డివిజన్ అధ్యక్షుడు చల్లా రవీందర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఆర్ ఫౌండేషన్ డివిజన్ ఇన్‌చార్జి సిగిరి తిరుపతి, ఫౌండేషన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీ మంథని పట్టణ అధ్యక్షుడిగా సంతోష్

మంథని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మంథని పట్టణాధ్యక్షుడిగా మున్సిపల్ పరిధిలోని బోయినిపేటకు చెందిన సబ్బని సంతోష్‌ను నియమిస్తూ ఆదివారం బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి అయ్యన్నగారి భూమయ్య ప్రకటించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా బోగోజు శ్రీనివాస్, తోట మధూకర్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు సబ్బని సంతోష్ మాట్లాడుతూ.. మంథని మున్సిపల్ పరిధిలో బీజేపీని బలోపేతం చేయటానికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం స్పందిస్తామన్నారు.

నేటి నుంచి ఆర్టిజన్స్ రిలే దీక్షలు

పెద్దపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి టీజీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఆవరణలో ఈనెల 20 నుంచి 24 వరకు రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నట్లు టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ మల్లోరి కిషన్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ మట్ట రాజు, కోచైర్మన్లు దుర్గం విశ్వనాథ్, ఎం.ఎల్లయ్య, కోకన్వీనర్ కాంపెల్లి రఘు, జడల సత్యం, కోశాధికారి దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్లను వెంటనే కన్వర్షన్ చేయాలని ఆ తరువాత జేఎల్ఎం, సబ్‌ఇంజనీర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలకు జిల్లా నుంచి ఆర్టిజన్ కార్మికులు పెద్దసంఖ్యలో తరలివచ్చి రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రిలే దీక్షలకు జిల్లాలోని విద్యుత్ అధికారుల, ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించాలని కోరారు.

పీహెచ్‌సీల్లో బీపీ మాత్రల కొరత

ఓదెల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు కొలనూర్, పొత్కపల్లి ఆరోగ్య కేంద్రాల్లో వృద్ధులకు నెలవారీగా అందజేసే బీపీ మాత్రల కొరత ఏర్పడింది. గతంలో ఇచ్చిన మాత్రలను కాకుండా వేరే మాత్రలు ఇస్తుండడంతో వృద్ధులకు అనారోగ్యం తప్పడం లేదు. రెండు నెలల నుంచి బీపీ మాత్రల కొరత ఏర్పడడం వల్ల విధిలేని పరిస్థితుల్లో వైద్యులు ఇచ్చిన మాత్రలను వాడుతున్నారు. అయినప్పటికీ బీపీ తగ్గుముఖం పట్టకపోవడంతో ప్రైవేట్ వైద్యుల వద్దకు వెళుతున్నామని పలువురు వాపోతున్నారు. వెంటనే వైద్యాధికారులు స్పందించి గతంలో ఇచ్చిన మాత్రలను అందజేయాలని వృద్ధులు కోరుతున్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం..

- అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు - కాళేశ్వరం జోన్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కోల్‌సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రీడల్లో పాల్గొనడం వల్ల వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందని రామగుండం కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు అన్నారు. కాళేశ్వరం జోన్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలను గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో పోలీస్ అధికారులతో కలిసి అడిషనల్ డీసీపీ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములనేవి సహజమని, గెలుపోటముల కంటే టీమ్ స్పిరిట్ గొప్పదన్నారు. ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉంటారని, అలాంటి నిర్విరామ విధులలో ఉన్న పోలీసులకు క్రీడలు నూతన ఉత్సాహంతో పాటు ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు. ఈ క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని, రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి కోరారు. ఈ పోటీలు రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీస్ టీమ్స్ మధ్య షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, టగ్ ఆఫ్ వార్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, అథెలిటిక్స్ క్రీడల్లో సెలక్షన్‌లు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, మల్లేశం, సంపత్, ములుగు ఆర్ఐ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో పాల్గొంటున్న క్రీడాకారులు

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి మండలం హనుమంతునిపేట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతిరావు ఆధ్వర్యంలో జీటీఆర్ కప్-2025 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఫైనల్ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ క్రీడల్లో ఓడినాగెలిచినా నైపుణ్యం అభివృద్ధి చెందుతుందన్నారు. తెలుగు వారి సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబింపచేసే సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణస్థాయి క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా క్రీడలు క్రమశిక్షణకు దోహదపడతాయన్నారు. ఈ టోర్నమెంట్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని నియోజకవర్గాల్లో అన్ని గ్రామాల్లో ఇలాంటి గ్రామీణ క్రీడలు నిర్వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోల్సాని సుధాకర్‌రావు, మాజీ సర్పంచ్ తీగల సదయ్య, గుజ్జుల కుమార్, పెద్దపల్లి సింగిల్‌విండో చైర్మన్ నరసింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరే సంతోష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల నరేష్, తీగల సతీష్, గుర్రాల వాసు, నాంసని శ్రీనివాస్, తూముల మహేష్,నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ..

- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేష్

పెద్దపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని పెద్దపల్లి మున్సిపల్ కమీషనర్ వెంకటేష్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో అన్ని వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందజేయనున్న నేపథ్యంలో పెద్దపల్లి మున్సిపల్ సిబ్బంది వారం రోజుల నుంచి అన్ని వార్డుల్లో కౌన్సిలర్ల సహకారంతో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సమగ్ర సర్వే ద్వారా 884, మీ సేవల ద్వార 1675అప్లికేషన్ దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. నివేదికలను వార్డులవారీగా సభ నిర్వహించి కౌన్సిలర్, ప్రజల సమక్షంలో వారి ముందు ఉంచుతామని, దరఖాస్తుదారుల పేర్లు రానట్లయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు వార్డు సభలో మున్సిపల్ సిబ్బందికి గానీ, కార్యాలయంలోని ప్రజాపాలన కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డు సభలు ఈనెల 21 నుంచి 23వరకు జరుగుతాని తెలిపారు. సమావేశంలో సుల్తానాబాద్, పెద్దపల్లి మున్సిపల్ మేనేజర్‌లు శివప్రసాద్, అలీం, ఏఈ సతీష్, టౌన్‌ప్లానింగ్ అధికారి వినయ్, సీనియర్‌అసిస్టెంట్ శ్రీశైలం, అకౌంటెంట్ నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలందరి సమానత్వం కోసమే రాజ్యాంగం

- ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ



అంబేద్కర్ జ్ఞాన మాల కార్యక్రమంలో మాట్లాడుతున్న సోమారపు సత్యనారాయణ

కోల్‌సిటీటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలందరి సమానత్వం కోసమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాశారని ఆర్టీసీ మాజీ చైర్మన్, రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అన్నారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75ఏళ్లు గడిచినా దేశ ప్రజలందరికి పూర్తిస్థాయిలో రాజ్యాంగ ఫలాలు అందలేదన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో పూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దళిత అణగారిన వర్గాలు ఆర్థికంగా సమానత్వంగా ఎదిగేందుకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలు కాలేదని, రాజ్యాంగం అమలు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సోమారపు సత్యనారాయణ , కార్పొరేటర్ ఫులేందర్‌లను ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ ఫులేందర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు, ఆలయ ఫౌండేషన్ మిట్టపల్లి రాజేంద్రకుమార్, మైస రాజేష్, పులి మోహన్, గొర్రె రమేష్, మహేష్, మొలుగూరి వీరయ్య, అర్నకొండ వెంకటేశ్వర్లు, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, కిష్టయ్య, రాజారత్నం, ఎం ఏ కరీం, శనిగరపు చంద్రశేఖర్, శశిభూషన్, పొగుల రంగయ్య, కాసిపాక రాజమౌళి, ఇనుముల రాజమౌళి, పవన్‌కుమార్, పెరిక రవి, కొండ్ర దాస్, మహేందర్, ఆసర్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో రాజ్యాంగంపై అవగాహన కల్పించడం, సమాజంలో సమానత్వ సాధనే జ్ఞానమాల ప్రధాన ఉద్దేశమని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. పూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలే వేశారు. ఈసందర్భంగా దళిత నాయకుడు సొప్పదండి దుర్గాప్రసాద్ మాట్లాడారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో తలపెట్టిన జ్ఞానమాల కార్యక్రమం ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్, బొంకూరి మోహన్, ఉదయ్‌కుమార్, సదానందం, శంకర్‌దయాల్ శర్మ, దేవేందర్‌రెడ్డి, బషీర్, రాజనర్సు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడి యువకుడి మృతి


నరేష్ మృతదేహం

ఇల్లందకుంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో ఆదివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి డ్రైనేజీలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం ఇందిరానగర్‌కు చెందిన సకినాల నరేష్ (30) తన అత్తగారి ఊరైనా పాతర్లపల్లి గ్రామానికి చెందిన తన బాబాయి కొడం జయపాల్‌తో కలిసి ఇల్లందకుంట నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లందకుంట ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో బైక్ అదుపు తప్పి డ్రైనేజీలోకి దూసుకెళ్లింది. తీవ్ర గాయాలతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. జయపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కోరుట్ల రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. కోరుట్ల పట్టణానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డు ప్రమాద వివరాలను గ్రామస్థులు, పోలీసులు తె లిపారు. నిజామాబాదు జిల్లా కేంద్రంలోని పెంటర్‌నగర్ చెందిన షేక్ రశీద్ (25) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై కోరుట్ల పట్టణంలోని బీముని దుబ్బ ప్రాంతంలోని తన అక్కను కలిసి జగిత్యాలలో ఉన్న స్నేహితుడిని కలవాడిని వెలు తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపూర్ శివారుకు చేరుకోగా జగిత్యాల నుంచి వస్తున్న కారు రశీద్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో రశీద్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన వ్యవసాయక్షేత్రం వైపు దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఆడెపు రాజు, గాజెంకి మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ, కోరుట్ల ఇన్‌చార్జి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. రశీద్ సోదరుడు షేక్ మజీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రశీద్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మానేయాలన్నందుకు మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మానేయాలని కూతురు మందలించినందుకు తల్లి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వేముల నర్సవ్వ (45) కొంత కాలంగా మద్యానికి బానిసైంది. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని కూతురు పూజితను అడగడంతో ఆరోగ్యం క్షీణిస్తుందని, మద్యం మానేయాలని మందలించింది. దీంతో మనస్తాపం చెందిన నర్సవ్వ శనివారం రాత్రి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన నర్సవ్వ తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కూతురు పూజిత, కొడుకు శేఖర్ చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. నర్సవ్వ భర్త రాజలింగం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయంలో, మల్లన్న స్వామి ఆలయంలో హుండీలను పగలగొట్టి అందులోని డబ్బులను దొంగిలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూచిపూడిలో రాణిస్తున్న 'ఖని' కళాకారిణి


కూచిపూడి కళాకారిణి జ్యోతిర్మయి

కోల్‌సిటీటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన దగ్గుల జ్యోతిర్మయి కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. తనలాగే ఎంతో ఆసక్తి కలిగిన ఎంతో మందిని కూచిపూడి నృత్య కళాకారుణులుగా తీర్చిదిద్దుతున్నది. ఆమె భర్త ఆనంద్ సింగరేణి ఆర్‌జీ-1 ఏరియా ఓసీపీ-5లో సింగరేణి ఉద్యోగి. జ్యోతిర్మయి మూడవ తరగతి చదువుతున్న సమయంలో తండ్రి రామస్వామి కూచిపూడి నృత్య అకాడమీ జక్క కృష్ణ వద్ద చేర్పించి శిక్షణ ఇప్పించారు. హైదరాబాద్‌లో ఏలేశ్వరపు విజయవల్లీప్రియ గురువు వద్ద కూచిపూడిలో డిప్లమా పూర్తి చేసింది. కూచిపూడి నాట్యప్రదర్శనలిస్తూ నాట్యజ్యోతిర్మయిగా పేరొందింది. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సహంతో జ్యోతిర్మయి జాతీయ స్థాయిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలిచ్చిన పలు అవార్డులు



జ్యోతిర్మయికి అవార్డుతో పలువురి సత్కారం

పొందింది. ఆలయాల్లో నృత్యప్రదర్శనలతో నాట్యనీరాజనం ఇచ్చేందుకు జ్యోతిర్మయి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది.

● **వైష్ణవి నాట్యస్థల్‌తో పలువురికి శిక్షణ..**

కూచిపూడి నృత్యాన్ని ఇతరులకు నేర్పించాలనే సంకల్పంతో వైష్ణవి నాట్యస్థల్ కూచిపూడి నృత్య అకాడమీని జ్యోతిర్మయి 15 ఏళ్ల క్రితం ప్రారంభించింది. తన శిష్యులతో పలు ప్రదర్శనలు ఇచ్చి గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకున్నానని, ఇది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని జ్యోతిర్మయి తెలిపింది.




కూచిపూడిలో శిక్షణ ఇస్తున్న జ్యోతిర్మయి

కారు అద్దాలు ధ్వంసం


పగిలిన కారు అద్దాలు

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మల్యాల మాజీ ఎంపీపీ ఆగంతపు రవళీవంశీధర్‌కు చెందిన కారు అద్దాలను ఓ యువకుడు ధ్వంసం చేశాడు. శనివారం రాత్రి సదరు యువకుడు వంశీధర్‌తో పాటు అతని కుటుంబసభ్యులను దుర్భాషలాడుతూ ఇంటి వద్దకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడ గల కారు అద్దాలను ధ్వంసం చేశాడు. కాగా తమపై దాడికి యత్నించినట్లు అదే ప్రాంతానికి చెందిన యువకుడిపై వంశీధర్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

వీణవంక జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసుల కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్ర మంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి


సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొండా దేవయ్య

వేములవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపులు ఐక్యతతో రాజకీయంగా ఎదగాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల మున్నూరు కాపు సంఘం కార్యాలయాన్ని ఆదివారం వేములవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ పరిధిలోని జిల్లాలకు చెందిన కార్యకలాపాల నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశంతో వేములవాడలో సంఘం కార్యాలయం ప్రారంభించామని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 3000 కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలుపుకోవాలని కోరారు. రాష్ట్ర మున్నూరు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రజిత, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులు రత్నాకర్, రాష్ట్ర యువత కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల పూజలు

ఓదెల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పూజలను ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన నుంచి తరలివచ్చిన భక్తులంతా ఆలయంలో అర్చనలు, కోడె మొక్కులను సమర్పించారు. అలాగే మల్లన్నకు భక్తులు ఒగ్గుపూజారులతో పట్నాలు నిర్వహించారు.


ఓదెల మల్లన్న ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

భూవివాదంతో దాడి..
ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలో ఆదివారం ఇరు వర్గాల నడుమ నెలకొన్న భూవివాదం దాడి చేసుకునే వరకు చేరుకుంది. దాడి ఘటనలో మండల కేంద్రానికి చెందిన గడ్డం పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. దాడికి పాల్పడిన బండలింగంపల్లిలోని తండ్రీకొడుకులు బందుక శ్రీనివాస్, నరేశ్‌లపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రంలోని గడ్డం ఆనందం 2020లో బండలింగంపల్లికి చెందిన నర్సయ్య వద్ద 1.08 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. పొలం వద్దకు వెళ్లిన ఆనందం భార్య పుష్పలత, ఇద్దరు కొడుకులు కరుణాకర్, జగన్‌పై అదే గ్రామంలోని బందుక శ్రీనివాస్, అతని కొడుకు నరేశ్ ఆ భూమి తమదేనని అడ్డుకున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే గడ్డపారతో దాడికి దిగారు. పుష్పలత, కరుణాకర్, జగన్ తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఆనందం ఫిర్యాదుతో శ్రీనివాస్, నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బోర్‌వెల్ వాహనం బోల్తా

మల్యాల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో బోర్‌వెల్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. జగిత్యాల వైపు నుంచి వస్తున్న బోర్‌వెల్ వాహనం బల్వంతాపూర్ స్టేజీ సమీపంలో జాయింట్ రాడ్డు విరగడంతో అదుపుతప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటనలో వాహనంలో గల ఒడిశాకు చెందిన సురేందర్, బీం, బాలారామ్, నిదేశ్‌లకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పని చేసి పదవి విరమణ పొందిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి రాజయ్య కోరారు. పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఆదివారం హుజూరాబాద్ రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల సమావేశం ఎం రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 పేస్కేల్ బకాయిలు, వృద్దాప్యంలో ఉన్న కార్మికులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఫ్రీగా అనుమతించాలన్నారు. రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే అందజేయాలని డిమాండ్ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు ఆర్ చారి, రాజయ్య, వి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి) వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజరాజేశ్వరస్వామివార్లను దర్శించుకు న్నారు. రాజన్నకు ప్రీతి ప్రాతమైన కోడె మొక్కు చెల్లించుకున్నా రు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు తిరుపతిరావు, రాజేందర్, నర్సయ్య, నరేందర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజన్న ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు



సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

● **కొనసాగుతున్న ఆరాధనోత్సవాలు**

వేములవాడ కల్చరల్ జనవరి 19 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు లక్ష్మీనారాయణ భాగవతార్, ఉదయం 10గంటలకు వేదవతి భాగవతారి ఆధ్వర్యంలో హరికథ నిర్వహించారు. అపర్ణ భార్గవ కర్ణాటక గాత్రకచేరి, తిరుమల లత సంగీత కచేరి భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు దుర్గా మైత్రి నిర్వహించిన సోలో వీణ కచేరి, నాలుగున్నర గంటలకు హరికృష్ణ భార్గవి నిర్వహించిన సంగీత కచేరి అలరించాయి.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర


తాండ్ర్యాలలో పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని తాండ్ర్యాలలో ఆదివారం మల్లికార్జునస్వామి జాతరోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి కొండపైకి స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పం డితులు మేడలాంబ కేతలాంబ సహిత మల్లికార్జునస్వా మి కల్యాణం నిర్వహించగా చుట్టు పక్కన గ్రామాలైన గంభీర్‌పూర్, పోసానిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల నుంచి వచ్చిన భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా భక్తులు త మ మొక్కులు చెల్లించుకున్నారు. వేము లవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్‌కు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జిల్లా పరిషత్ మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ పూజల్లో పాల్గొ న్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్శరాం

వేములవాడ కల్చరల్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ జాతీయ సంక్షేమ సంఘం యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెడ్డవేణి పర్శరాంను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామకపు పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం నియామక పత్రాన్ని అందిం చినటట్లు బీసీ జాతీయ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాం తెలిపారు. తన నియమకానికి సహకరించిన ప్రతీ ఒక్క బీసీ జాతీయ సంక్షేమ రాష్ట్ర జిల్లా మండల నాయకులకు రెడ్డవేణి పర్శరాం కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహనం అప్పగింత

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కొద్ది రోజులుగా ఉంటున్న టీఎస్02ఈక్యూ7104 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని యజమాని అందె కృష్ణకు ఆర్టీసీ అధికారులు ఆదివారం అందించారు. కొద్ది రోజులుగా బస్టాండ్ ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని ఉండడాన్ని గమనించి భద్రత సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ భద్రత ఏటీఎం బి సురేష్ ద్విచక్ర వాహనాన్ని యజమానికి అందించారు. తన బైక్ ఇంటి ఎదుట పార్క్ ఉన్న ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లారని, నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశానని బాధితుడు పేర్కొన్నాడు. కార్యక్రమంలో బస్టాండ్‌భద్ర త సిబ్బంది లక్పతి, ఏఎస్‌ఐ అజయ్‌కుమార్, అంజయ్య, పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాల బాలికల కబడ్డీ పోటీలు


విజయం సాధించిన కరీంనగర్ బాలికల జట్టు

హుజూరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో సౌత్‌జోన్ బాల బాలికల అండర్-16 కబడ్డీ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. బాలికల విభాగంలో హుజూరాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో కరీంనగర్ జట్టుపై హుజూరాబాద్ జట్టు ఫైనల్లో విజయం సాధించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక బహుమతులు ప్రదానం చేశారు. అలాగే క్రీడాకారులకు వర్ధినేని రవీందర్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్‌రెడ్డి, రమేష్, రవీందర్, తిరుమల్‌రెడ్డి, ముత్యంరాజు, టి శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

ఆశలు అడియాశలు

● నెరవేరని పరిశ్రమల ఏర్పాటు హామీ
● అందుబాటులో 600 ఎకరాల ప్రభుత్వ భూమి


గంభీర్‌పూర్‌లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి

కథలాపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హార్టికల్చర్ యూనివర్శిటీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, గొర్రెల పెంపకం, సైనిక్ స్కూల్, లెదర్ పార్క్ వంటి పరిశ్రమలు గంభీర్‌పూర్‌కు వస్తాయని గంపెడాశలు పడ్డా కల నెరవేరలేదు. గత బీఆర్ఎస్ హయాంలో పరిశ్రమలు వస్తాయంటూ నేతలు ఇచ్చిన హామీ లతో స్థానికులు ఎంతో సంబరపడ్డా నిరాశే ఎదురైంది. గ్రామ శివారులో గుట్టల ప్రాంతంలో సుమారు 600 ఎకరాలు మేర ప్రభుత్వ భూములు ఉండడంతో ఇక్కడ పరిశ్రమలకు అనువైన ప్రాంతమని నిర్ణయించారు.

● **గంభీర్‌పూర్ శివారులో..**

గంభీర్‌పూర్ శివారులో 570, 571 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదికలతో పరిశ్రమల స్థాపనకు అనువుగా ఉంటుందనే భావనకు వచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్ఎస్ సర్కారు కొలువు దీరగా హార్టికల్చర్ యూనివర్శిటీ ఏర్పాటు కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సంబంధిత శాఖ అధికారులు హడావుడి చేశారు. అయితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజవర్గం గజ్వేల్‌కు మంజూరు చేయడంతో నిరాశకు గురయ్యారు. తదనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటును పరిశీలించి రెవెన్యూ అధికారులతో సర్వేలు పూర్తి చేయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఫలితం కనిపించలేదు. గొర్రెల పెంపకం, లెదర్ పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదు. పరిశ్రమలు ఏర్పడితే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశించినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు.

● **నాలుగు మండలాలతో..**

బీమారం, కొడిమ్యాల, రుద్రంగి, చందుర్తి మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాకు అనుసంధానంగా ఉండడంతో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల మెరుగుకు ఎంతో అనుకూలంగా ఉంది. గత సర్కారు విస్మరించిన నేపథ్యంలో కొత్త సర్కారు గంభీర్‌పూర్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తుందని కోటి ఆశలు పెట్టుకున్నారు

అనుమతి లేని లేఅవుట్‌లో హద్దు రాళ్ల తొలగింపు

కరీంనగర్ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని అక్రమ లేఅవుట్లపై ఆదివారం పంచాయతీ అధికారులు కొరడా ఝళిపించారు. నగునూర్‌లోని సర్వే నంబర్ 453, 454లోని రెండెకరాల విస్తీర్ణంలో పంచాయతీ, సుడా అనుమతి లేకుండానే లే అవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది హద్దు రాళ్లను తొలగించారు.

షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తాం


- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ పునఃప్రారంభిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరాభవన్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన కోటి యాభై లక్షల విలువల గల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి కింద లబ్ధిదారులకు ఆసుపత్రుల్లో అయిన ఖర్చులో 25-30 శాతం అందిస్తోందన్నారు. ప్రజలు ముఖ్యంగా ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్న ఆసుపత్రుల్లో వైద్యసేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ కింద రాష్ట్ర ప్రభుత్వం 10లక్షల రూపాయల వరకు వైద్య ఖర్చులు అందజేస్తోందన్నారు. గత ప్రభుత్వం కన్నా మిన్నగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రుణమాఫీ అంశాన్ని బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల మెనిఫెస్టోలో పెట్టలేదని, బీజేపీకి రుణమాఫీపై సోయిలేదన్నారు. దేశంలో రైతులకు రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వమే అన్ని రాష్ట్రాల రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, గత ప్రస్తుత ప్రభుత్వాలు ఆ విధానాన్ని కొనసాగింపు చేస్తున్నాయన్నారు. జనవరి 26 నుంచి రేషన్‌కార్డుల జారీ, రైతుభరోసా, వ్యవసా య కూలీలకు రైతు భరోసాతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు కట్టించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, అనర్హులకు ఒత్తిళ్లకు తలొగ్గి ఇళ్ల మంజూరుకు అవకాశం ఇస్తే చట్టప్రకారం చర్యలుంటాయ న్నారు. పసుపు బోర్డు ప్రకటన శుభపరిణామమని, పసుపు బోర్డు ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. సమావేశంలో నాయకులు బండ శంకర్, తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి, పిప్పిరి అనిత, జున్ను రాజేందర్, రాధాకిషన్‌రావు, దుర్గయ్య, బారి, కమాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మీ టికెట్'తో చూసొద్దామా..



- ఆలయాలు, పర్యాటక ప్రాంతాల సమాచారంతో ప్రత్యేక యాప్
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయ దర్శనాలు, విహార యాత్రల విశేషాలు తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మీ టికెట్ పేరుతో ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో రాష్ట్రంలోని 15 ఆలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్, జంతు ప్రదర్శన శాలలు, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్‌కు సంబంధించిన వివరాలు పొందుపరిచారు. స్మార్ట్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని సంబంధిత ప్రవేశ టికెట్లు పొందవచ్చు. ఇటీవల ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. మరిన్ని ప్రధాన ఆలయాలు, పర్యాటక ప్రాంతాల వివరాలు ఈ యాప్‌లో పొందుపరచాల్సి ఉంది.

● ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, ప్రాంతాల వివరాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి దేవాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా అర్బన్ ఫారెస్ట్, కరీంనగర్‌లోని ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్‌కు సంబంధించిన వివరాలు యాప్‌లో ఉంటాయి.

● డౌన్‌లోడ్ ఇలా చేసుకోవాలి

తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరి వారు రూపొందించిన 'మీ టికెట్' యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. అకౌంట్‌లో పిన్ నంబరు జనరేట్ చేసుకోవాలి. మన ఫోన్‌కు ఓటీపీ నంబరు వచ్చాక దాన్ని నమోదు చేయాలి. అనంతరం ఫోన్ నంబరు, పిన్ నంబరు ఎంటర్ చేసి లాగిన్ అయితే అందులో అన్ని వివరాలు తెలుస్తాయి.





వేములవాడ

గర్భాలయ దర్శనం	రూ. 1000
శీఘ్ర దర్శనం	రూ. 100
కోడె కట్టడానికి	రూ. 200

సేవలకు వేర్వేరుగా రుసుములు చెల్లించాల్సి ఉటుంది.



కొండగట్టు

గర్భాలయ దర్శనం	రూ. 400
అతి శీఘ్ర దర్శనం	రూ. 300
శీఘ్ర దర్శనం	రూ. 100



ఎల్ఎండీ, పెద్దపల్లిలో బోటింగ్

పిల్లలకు	రూ. 30
పెద్దలకు	రూ. 50
స్పీడ్ బోట్‌కు నలుగురికి	రూ. 350



సిరిసిల్లలోని అర్బన్ ఫారెస్ట్ పార్క్

కెమెరా	రూ. 300,
టూ వీలర్స్ పార్కింగ్	రూ. 10
బస్సు, వ్యానుకు	రూ. 50
ప్రవేశ రుసుము:	
పిల్లలకు	రూ. 10
పెద్దలకు	రూ. 30

● యాప్‌లో ఇంకా చేర్చాల్సినవి..

ధర్మపురి ఆలయ వివరాలు.. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఉజ్వల, జింకల పార్క్ విశేషాలు, జిల్లా కేంద్రంలోని ప్రాచీన శైవ, వైష్ణవ క్షేత్రాల వివరాలు పొందపర్చలేదు. ఎలగందుల, మొలంగూరు, బొమ్మలమ్మగుట్ట, నగునూరు, ధూలికట్ట వంటి చారిత్రక ప్రదేశాల వివరాలను కూడా పొందుపరిస్తే ఉమ్మడి జిల్లా వాసులు ఆయా ప్రాంతాలను యాప్ సాయంతో సందర్శించే అవకాశం ఉంటుంది.

వినోద భోజనంబులో 'ఖని' కళాకారుడి ప్రతిభ

కోల్‌సిటీటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో దర్శకుడు జంధ్యాల జయంతి సందర్భంగా నిర్వహించిన వినోద భోజనంబు కార్యక్రమంలో గోదావరిఖనికి చెందిన స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ ప్రధానకార్యదర్శి చంద్రపాల్ ప్రతిభ కనపర్చారు. స్టాండప్ కామెడీతో నవ్వులు పూయించి ప్రశంసలందుకున్నారు. అందుకు గాను హాజరైన అతిథులు సినీదర్శకులు రేలంగి నరసింహారావు, దూరదర్శన్ ప్రయోక్త ఓలేటి పార్వతీశం చేతుల మీదుగా చంద్రపాల్‌కు జ్ఞాపికను అందజేసి అభినందించారు.



జ్ఞాపిక అందుకుంటున్న చంద్రపాల్

ఘనంగా గ్యార్మీ షరీఫ్ వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రంగంపల్లిలోగల పెద్దపల్లి లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బారీ, ప్రధానకార్యదర్శి సోమిశెట్టి తిరుపతి, వైస్‌ప్రెసిడెంట్ అజయ్, జాయింట్ సెక్రెటరీ ఎండి జహంగీర్, కోశాధికారి ఎండి అఫ్జల్, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వేడుకలు నిర్వహిస్తున్న లారీ డ్రైవర్లు

కన్నుల పండువగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని దసరా గుట్టపైన గల ప్రహ్లాద శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో స్వామి కల్యాణం కన్నుపండువగా నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణాన్ని గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో స్థాపిత దేవతల పూజ, ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు, పూజలు కార్యక్రమా ను బ్రహ్మశ్రీ గంగాప్రసాద్ దీక్షిత్ యాజ్ఞికంలో నంబి గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. స్వామి వారికి గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు పట్టు వస్త్రా లు సమర్పించగా అలంకరించారు. అనంతరం పురోహితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పురోహితులు రాజగౌతం, శితి కంఠ, షణ్ముఖశర్మ, నంబి మనోహర్‌శర్మ, నంబి రాజేందర్‌శర్మ, గ్రామ, ఆలయా భివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతులు లేని సంఘాలతో క్రీడాకారులకు అన్యాయం

- హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు, నిబంధనల ప్రకారం లేని హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌తో క్రీడాకారులకు తీవ్రఅన్యాయం జరిగే అవకాశం ఉందని తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు 52 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. అసోసియేషన్ పరిధిలో పనిచేస్తున్న తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను, జిల్లాలోని అసోసియేషన్లు జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. 2021లో ఓ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని రాష్ట్రం, జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులు లేకుండానే సంఘాలను ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా సంఘాన్ని నడుపుతున్నట్లు ఆరోపించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర పోటీలు లేకుండానే జాతీయ పోటీలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి పోటీలతో క్రీడాకారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సంఘం రాష్ట్రస్థాయిలో కీలకమైన పోస్టులో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్న వ్యక్తి కోచ్‌గా వ్యవహరిస్తూ రాష్ట్ర, జాతీయ పోటీలకు రెఫరీగా వ్యవహరిస్తున్నాడని, ఈ విషయంపై స్పోర్ట్ అథారిటీ దృష్టి సారించాలని కోరారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేణి లక్ష్మణ్ మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు తమ రాష్ట్ర అసోసియేషన్ అనుమతి ఉన్నట్లు చూపించి జిల్లాలో ఓ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేసి క్రీడాకారులను తప్పుదోవ పటిస్తున్నాడన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌పై రిజిస్ట్రార్, సీపీకి ఫిర్యాదు చేసి కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె రమేష్, నల్గొండ కార్యదర్శి పుల్లయ్య, మహబూబ్‌నగర్ కార్యదర్శి శంకర్ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ సంఘ సభ్యులు రమేష్, పుల్లయ్య, శంకర్ నారాయణ, లక్ష్మణ్

పట్టు పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్‌గా రషీద్

కరీంనగర్ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గా మహ్మద్ రషీద్‌కు పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ యాస్మిన్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సెరికల్చర్ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు పదోన్న తి కల్పించారు. 1985లో దినసరి కూలీగా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో నాలుగేళ్ళు పనిచేసిన ఆయన స్కేల్ పోస్టు ఆపరేటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇక ఆ తర్వాత సెరికల్చర్ ఆఫీసర్‌గా పదోన్నతి పొంది హన్మకొండ జిల్లాలో పనిచేసిన రషీద్ హుజూరాబాద్ డివిజన్ సెరికల్చర్ అధికారిగా, కరీంనగర్ జిల్లా అధికారిగా కొనసాగుతున్నారు. పదోన్నతి కల్పించడంపై రషీద్ సంతోషం వ్యక్తం చేశారు.



మహ్మద్ రషీద్

ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్య పోరాటాల ద్వారానే కనీస వేతనం, మద్దతు ధరలు సాధించుకోవచ్చని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక, కర్షక మైత్రి దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 జనవరి 19న సాధారణ సమ్మె సాధించిన గొప్ప విజయం కార్మికుల, కర్షకుల ఐక్యత అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ సాధారణ సమ్మెకు ముందే తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వం వేలాది మందిని అరెస్టు చేసి జైలులో వేసిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వడ్ల రాజు మాట్లాడుతూ వ్యవసాయకార్మికులు, పేద రైతులే కాక గ్రామాల్లో ఉన్న వృత్తి దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాయికంటి శ్రీనివాస్, కాంపల్లి పోచయ్య, రాజమణి, కవ్వంపల్లి రవి పాల్గొన్నారు.

రైతు సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్‌యాదవ్

ముత్తారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మొగిలి కిరణ్ యాదవ్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ నియామక పత్రాలను హైదరాబాదులోని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మొగిలి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ పూర్వ వ్యవసాయసాగులో ఎలాంటి పద్ధతులు పాటించారో రైతులకు తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు నకిలీ విత్తనాల విక్రయాలు, అత్యధిక ధరలకు ఎరువు విక్రయాలను ఉపేక్షించబోమని తెలిపారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చిగురు విద్యాసాగర్‌ను నియమితులైనట్లు కిరణ్ యాదవ్ తెలిపారు.



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

క్రీడలతో ఆరోగ్యం

- ఆర్ఐలు కుమారస్వామి, మోడం సురేష్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆనందం, ఆరోగ్యం పెంపొందుతాయని ఆర్ఐ ఆఫ్ పోలీస్ కె కుమారస్వామి, మోడం సురేష్ అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రెండో రోజు తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో వ్యాయామం, క్రీడలు తప్పనిసరి అని సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను అభినందించారు. క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని, ఓడినవారు వచ్చే సంవత్సరం గెలుపునకు ప్రయత్నించాలన్నారు. క్రీడాకారులు అందరు కూడా గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. మరో అతిథి జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి బి వేణుగోపాల్ మాట్లాడుతూ క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడలు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్లు మంచి ప్రతిభచాటి చాంపియన్‌షిప్ సాధించాలన్నారు. కార్యక్రమలో తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, పోటీల పరిశీలకులు దీపక్ ప్రసాద్, ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, కోశాధికారి కనకయ్య, సంఘ రాష్ట్ర బోర్డు కన్వీనర్ ఇంద్రసేనా రెడ్డి, సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారులు మల్లేష్, శ్రీనివాస్, రాజశేఖర్, జయంత్, అమర్, శివాజీ, సాయి,తదితరులు పాల్గొన్నారు.



హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్ఐలు కె కుమారస్వామి, మోడెం సురేష్

● ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు..

తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల ఫైనల్స్‌కు కరీంనగర్, వరంగల్ జట్లు చేరాయి. ఆదివారం సాయంత్రం జరిగిన సెమీఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో కరీంనగర్ జట్టు 23-21 పాయింట్ల తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు ప్రవేశించింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో వరంగల్ జట్టు 28-15 పాయింట్ల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై గెలుపొంది ఫైనల్స్‌కు చేరింది. సోమవారం ఉదయం ఫైనల్స్ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. కాగా మూడు, నాలుగు స్థానాల కోసం మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఆర్థిక సహాయం అందజేత

కోల్‌సిటీటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మరణించిన గోదావరిఖని పరుశురామ్‌నగర్‌కు చెందిన దాసరి నర్సయ్య కుటుంబానికి పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసింది. ఆదివారం దాసరి నర్సయ్య కుటుంబాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు పెండు డిలైట్, ఉపాధ్యక్షులు పెంద్రు ప్రజ్వల, ప్రధాన కార్యదర్శి మారం రాజ్‌కుమార్ పరామర్శించి ఆర్థికసహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి పెంద్రు జీవన్, స్వచ్ఛంధ కార్యకర్తలు సుజాత, రాజమణి, ప్రసన్న, సుమంత, రమేష్, శ్యామ్, మోజేస్, రాహుల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

రామగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన నిరుపేద కారంగుళ్ళ మల్లయ్యకు ఆదివారం రేండ్ల శారద కుమారస్వామి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఇటీవల వెన్నెముక శస్త్రచికిత్స చేసుకున్న మల్లయ్య నడవలేని పరిస్థితిని గుర్తించిన రేండ్ల శాదరకుమారస్వామి దంపతులు సొంత ఖర్చులతో నిత్యావసర వస్తువులను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మల్లయ్య కుటుంబ సభ్యులు రేండ్ల శారద కుమారస్వామి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పడాల మొగిళిగౌడ్, ముత్యం నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్టుల ప్రదానం

మంథని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): శికోకయి షిటోరియో కరాటే ఆధ్వర్యంలో స్థానిక ఫ్రెండ్స్ క్లబ్‌లో కోచ్ కవేటి సమ్మయ్య పర్యవేక్షణలో విద్యార్థులకు ఆదివారం బెల్టు టెస్టు నిర్వహించారు. వివిధ కలర్స్ బెల్టులు సాధించిన విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రమ, వొడ్నాల శ్రీనివాస్, గోటికారి కిషన్‌జీ బానయ్య, రవి, పాపయ్య, అజీం సమ్మయ్యలు పాల్గొన్నారు.

రచ్చపల్లిలో క్షయ శిబిరం

మంథనిరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చపల్లి గ్రామంలో గద్దలపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో క్షయ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. క్షయ వ్యాధి, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పోచం, వైద్య సిబ్బంది అనూష, వరలక్ష్మీ, జ్యోతి, స్వామి, సునీతలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మంథని/మంథనిరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోచమ్మవాడలో సురపత్తుల శంకర్ మృతిచెందగా పార్థవదేహాన్ని మాజీఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. మండలంలోని ఖానాపూర్‌లో నారమల్ల మల్లమ్మ, బిరుదు చిలుకమ్మ, పర్శవేన శంకరయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను పుట్ట మధు పరామర్శించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న నారమల్ల రాజయ్య, ఆపరేషన్ చేయించుకున్న తోట రాజక్కలను ఆయన పరామర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు తగరం శంకర్ లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపికుంటలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. తాటి చెట్టు మీద నుంచి పడ్డ గీతకార్మికుడు వడ్లకొండ నారాయణ, ప్రమాదంలో గాయపడిన కూచన కనుకయ్య పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, ఇటీవల మిడివెల్లి శంకర్, కోల కవిత, జూలేఖ బేగం, భూతగడ్డల మల్లయ్యలు మృతిచెందగా వారి కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలిగేడు పోలీస్ స్టేషన్ ప్రారంభమెప్పుడో?

● ఉత్కంఠగా ఎదురుచూస్తున్న మండల ప్రజలు
● ముమ్మరంగా కొనసాగుతున్న మరమ్మతు పనులు



ఎలిగేడులో పోలీస్ స్టేషన్ కోసం ఎంపిక చేసిన భవనం..

ఎలిగేడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఎలిగేడులో నూతనంగా ఏర్పాటు కానున్న పోలీస్ స్టేషన్ ఎప్పుడు ప్రారంభమవుతుందోననే ఉత్కంఠ మండల ప్రజల్లో నెలకొంది. 2001లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎలిగేడును ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 57వ మండలంగా ఏర్పాటుచేసింది. జూలపల్లి మండలంలో పోలీస్‌స్టేషన్ కొనసాగిస్తూ మిగతా ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఎలిగేడులో ప్రారంభించారు. 24ఏళ్లు అయినప్పటికీ మండలంలో పోలీస్ స్టేషన్ లేక పోవడం వల్ల వివిధ రకాల కేసుల నిమిత్తం జూలపల్లికి వెళ్లాల్సి వచ్చేది. దీతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో పోలీస్ స్టేషన్ కోసం ధర్నా, రాస్తారోకో చేయడమేకాకుండా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఎట్టకేలకు మాట నిలుపుకున్నారు. డిసెంబరు 4న పెద్దపల్లిలో జరిగిన భారీ బహిరంగ సభలో ఎలిగేడులో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందులో భాగంగా పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఇతర అధికారులు మండల కేంద్రంలో పర్యటించి పోలీస్ స్టేషన్‌కు అనుకూలంగా ఉండే భవనాలను పరిశీలించారు. గతంలో రెవెన్యూ కార్యాలయం నిర్వహించిన భవనాలను ఎంపిక చేశారు. 20రోజులుగా భవనాన్ని స్వాధీనం చేసుకొని చుట్టూ ఉన్న చెత్తచెదారం, ముళ్లపొదలను తొలగించి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. భవనానికి రంగులు, నీరు, విద్యుత్ సౌకర్యం పునరుద్ధరణ, గదుల్లో అటాచ్డ్ బాత్‌రూంలు, ఇతర చిన్నచిన్న మరమ్మతు పనులు చేస్తున్నారు.

ఎమ్మెల్యే చొరవతోనే పోలీస్ స్టేషన్..

- దుగ్యాల సంతోష్‌రావు, శివపల్లి



పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కృషి, పట్టుదల వలన పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలోనే మండల ప్రజలకు పోలీస్ స్టేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది..

- సామ రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు



ఎలిగేడు మండల ప్రజలు 24ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరింది. ఇచ్చిన మాటకు కట్టుబడి పదవి చేపట్టిన ఏడాదికాలంలోనే ఎమ్మెల్యే విజయరమణారావు పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటుచేయించి ప్రజల మనిషిగా నిలిచిపోయారు.

ఆపదలో ఆదుకోవడం స్నేహితుడి లక్షణం..

- ఆత్మీయ సమ్మేళనంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు



మంగపేటలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఆదుకోవడం నిజమైన స్నేహితుడి లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981-82లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బొంతకుంటపల్లి గ్రామంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఇదే బాచ్‌కు చెందిన ఎమ్మెల్యే తన పూర్వమిత్రులతో కలిసి తమకు చదువు చెప్పి, విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. నలభై మూడు ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పూర్వ విద్యార్థుల బృందం సామాజిక సేవారంగంలో ముందుండాలని, తన వంతు సహకారం ఉంటుందన్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత, ఎక్కడో స్థిరపడిన దాదాపు వంద మందికి పైగా పూర్వ విద్యార్థులందరినీ ఒక చోటకు చేర్చడంలో కృషి చేసిన సభా అధ్యక్షుడు పారుపల్లి వెంకట ఉమాపతి, సీఎం సెక్యూరిటీ ఆఫీసర్, ఆదనపు ఎస్పీ చెరుకు వాసుదేవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజ మల్లు, తిరుపతి, మధుమతి, శ్రీదేవి, సీ తిరుపతి తదితరులను ప్రత్యేకంగా అభినందించారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వారితో పాటు ఆహ్వాన కమిటీ ప్రతినిధులను ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు తదితరులు ఘనంగా సన్మానించి వారందరికీ మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రాధాక్రిష్ణారెడ్డి, చెరుకు రమేష్‌రెడ్డి, నర్సింగరావు, ఎస్.సుగుణాకర్, నల్ల రవీందర్, ఆది హరిమోహన్‌రావు, పూసాల మనోహర్, కొలిపాక సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగపేటలో 2005-2006లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు అందరు పాఠశాలలో ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి ఆటలు ఆడారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, స్వామిదాస్, సీతాభాయ్, సునీత, వసంత, స్వరూప, బుడగ కుమార స్వామి, జాన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే వ్యాపారాలు

(5వ పేజీ తరువాయి)

ట్రేడ్ లైసెన్స్‌లు, ఎన్‌వోసీలు తీసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఎల్‌ఆర్‌ఎస్, ఇతర నిర్మాణ అనుమతుల రుసుములను పెద్దఎత్తున ఎగ్గొడుతున్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూడు పెట్రోల్ బంక్‌లకు నగరపాలక సంస్థ పెనాల్టీ నోటీసులు జారీ చేసింది. కార్పొరేషన్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ గత నెల30న కలెక్టర్ ఆదేశానుసారం తెలంగాణ మున్సిపల్ చట్టం-2019 ప్రకారం పెట్రోల్ బంక్‌లకు పెనాల్టీ నోటీసులు జారీచేశారు. సంతోషీమాత ఆటో సర్వీస్(ఇండియన్ ఆయిల్) రూ.14.78 లక్షలు, లేపాక్షి ట్రాన్స్‌పోర్టు(హెచ్‌పీ) రూ.38.5లక్షలు, హర ఫిల్లింగ్ స్టేషన్ రూ.19.36 చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. వీటితో పాటు కార్పొరేషన్‌లోని మరిన్ని బంక్‌లకు నోటీసులు జారీ అయ్యాయి.

కొత్త పథకాల అర్హుల ఎంపికకు వార్డు సభలు

- రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి అర్హుల ఎంపిక కోసం ఈనెల 21,22,23 తేదీలలో వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీన ఉదయం 1, 2, 11, 12, 21, 22, 31, 32, 41, 42, మధ్యాహ్నం 3, 4, 13, 14, 23, 24, 33, 34, 43, 44 డివిజన్లలో, 22వ తేదీ ఉదయం 5, 6, 15, 16, 25, 26, 35, 36, 45, 46, మధ్యాహ్నం 7, 8, 17, 18, 27, 28, 37, 38, 47, 48 డివిజన్లలో, 23వ తేదీ ఉదయం 9, 19, 29, 39, 49, మధ్యాహ్నం 10, 20, 30, 40, 50 డివిజన్లలో సభలు జరుగుతాయని తెలిపారు. జాబితాలో పేర్లు లేనివారు కొత్త రేషన్ కార్డులకు ఈ వార్డు సభల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ నంబర్, చిరునామా, మొబైల్ నంబర్ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి గ్రామసభలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతుబంధు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై ఈనెల 21నుంచి మండలంలోని 24గ్రామపంచాయతీలలో సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామ్మోహనచారి తెలిపారు. 21న ఆరేపల్లి, తారుపెల్లి, పెగడపల్లి, పందిళ్ల, ఆశన్నపల్లి, కిష్టంపేట, కునారం, ఇదిలాపూర్, పెద్దరాతుపల్లి, జాఫర్‌ఖాన్‌పేట, మొట్లపల్లి, కాల్వశ్రీరాంపూర్, వెన్నంపల్లి, 23న అంకంపల్లి, చిన్నరాతుపల్లి, మంగపేట, గంగారం, ఇప్పలపల్లె, మల్యాల, మడిపల్లి కాలనీలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగుకు యోగ్యత లేని భూముల సర్వేల వెల్లడి, ఆమోదితం కోసం ఈనెల 21నుంచి 23 వరకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ యాకయ్య తెలిపారు. 21న కొమిర, భీమరపల్లి, బాయమ్మపల్లి, రూపునారాయణపేట, ఉప్పరపల్లి, గుండ్లపల్లిలో, 22న అబ్బిడిపల్లి, లంబాడతండ, జీలకుంట, గూడెం, హరిపురం, పిట్టలెల్లయ్యపల్లిలో, 23న ఓదెల, నాంసానిపల్లి, పొత్కపల్లి, గుంపుల, ఇందుర్తి, కోలనూర్, గోపరపల్లి, కనగర్తి, మడక గ్రామాల్లో సభలను నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ గ్రామసభలు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామ సభలను నిర్వహిస్తామని తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు..

సుల్తానాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):మంద కృష్ణ మాదిగను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకుడు గుండా థామస్ మాదిగ తదితరులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాలమహానాడు నాయకులు ఈనెల 17న మంద క్రిష్ణ మాదిగను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తాము పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశామని థామస్ తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో చంద్రమౌళి, శ్రీనివాస్, నాంపల్లి, దేవేందర్, కిరణ్ ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ పనుల పరిశీలన

సుల్తానాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను ఆదివారం అధికారులు పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపడీఓ దివ్యదర్శన్ రావు, పాషా, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

శ్రీసీతారామ సేవా సదన్‌కు అంబులెన్స్ వితరణ



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న నారాయణగురూజీ

మంథని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సీతారామ సేవా సదన్‌కు బోయింగ్ ఇండియావారు తమ సీఎస్ఆర్ ద్వారా నూతన అంబులెన్స్‌ను ఆదివారం వితరణ చేశారు. బోయింగ్ ఇండియా సంస్థలో సీఎస్ఆర్ హెడ్‌గా పనిచేస్తున్న మంథనికి చెందిన యజ్ఞంభట్ల ప్రవీణ రాజేశ్వర్ సహకారంతో ప్రెసిడెంట్ రజత్‌జైన్‌అంబులెన్స్‌ను అందించగా సదన్ వ్యవస్థాపకులు గట్టు నారాయణగురూజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సదన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, ఉపాధ్యక్షుడు కే. శ్రీనివాస్, కార్యదర్శి దుద్దిళ్ల గణపతి, సంయుక్త కార్యదర్శి ప్రహ్లాద్, కోశాధికారి అంబరీష్, సువర్ణ చంద్రశేఖర్, హరి, జ్యోతి, రాధాకృష్ణలు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతాం'

సుల్తానాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాను చాటుతామని బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అన్నారు. సుల్తానాబాద్‌లో ఆదివారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందుల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికలను సమర్థవంతంగా ఎదురుకునేందుకు పార్టీని అన్ని విధాలా బలోపేతం చేసే చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నేతలు మల్క భాగ్యలక్ష్మీ, కొల్లూరి సంతోష్, ఇగురం రామస్వామి, పెరక రమేష్, మెండే శంకరయ్య, నర్సింగోజు రమేష్, వడ్లకొండ మహేష్, శేఖర్, జెట్టి శ్రీనివాస్, రాంరెడ్డి పాల్గొన్నారు.

పుల్లూరి రఘువర్ధన్‌రావుకు ఘన నివాళి



రఘువర్ధన్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జూలపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడుకాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుల్లూరి రఘువర్ధన్‌రావు వర్ధంతిని పార్టీ నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రావు సతీమణి మంజుల, మాజీ ఎంపీపీ మొగురం రమేష్, ధర్మారం మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ కాడె సూర్యనారాయణతో పాటు పుల్లూరి కృపాకర్‌రావు, కొత్త రవిందర్, ఎర్రోల్ల రాములు, వేల్పుల ఓదెలు, గుమ్మడి లక్ష్మణ్, కన్నం రాజేశం, మొగురం నరేష్, కనుకయ్య, అంజయ్య, దేవయ్య, ఖాజా మియా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత విద్యనందించడమే లక్ష్యం

- వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం వాకర్స్‌తో కలిసి ఎమ్మెల్యే మార్నింగ్ వాకింగ్ చేశారు. అనంతరం మైదానానికి సంబంధించిన వాకింగ్ ట్రాక్, పలు సమస్యలను సభ్యులు ఆయన దృష్టికి తీసుకరాగ త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ అందరం కలిసి కట్టుగా ఉన్నప్పుడే పట్టణాన్ని అభివృద్ధి చేసుకోగలమని, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించబోయే భవనం కారణంగా వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండేలా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అనంతరం వాకర్స్‌కు అనుగుణంగా మంచి వాకింగ్ ట్రాక్‌ను నిర్మిస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు సరదాగా కళాశాల మైదానంలో క్రికెట్, బ్యాడ్మింటన్ ఆడారు.

ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుళ జాతి సంస్థలకు ఖనిజ సంపదను అప్పగించే కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న కే రాజన్న

కళ్యాణ్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందని, విప్లవ సంస్థలు లేకుండా బీజేపీ కుట్రలు పన్నుతోందని, ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కే రాజన్న చెప్పారు. ఆదివారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారేడుపాక అడవుల్లో 17 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 2026 నాటికి దేశంలో విప్లవ సంస్థలు లేకుండా చేస్తామని మోదీ, అమిత్‌షాలు ప్రకటించారని, ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికే 265మందిని బూటకపు ఎన్‌కౌంటర్‌లలో హత్య చేశారని పేర్కొన్నారు. బహుళ జాతి సంస్థలకు ఖనిజ సంపదను అప్పగించడానికి ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టడానికి ముఖ్యమంత్రులు, అధికా రులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో దోస్తీ కుదిరి ఆపరేషన్ కగార్ పేరుతో తెలంగాణలో విప్లవ సంస్థలు లేకుండా చేయడానికి ప్రణాళిక రూపొందించిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం విప్లవ సంస్థలపై చేస్తున్న నరమేధాన్ని ఆపాలని, లేకుంటే గత ప్రభుతాలకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అధికారాన్ని చేపట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఫిబ్రవరి 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- పోలీసు ఆధ్వర్యంలో అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేష్

ముత్తారం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముత్తారం గ్రామపంచాయతీ పరిధిలోని కాసర్లగడ్డ బస్టాండ్ వద్ద ఎస్సై గోపతి నరేష్ ఆధ్వర్యంలో పోలీసుల కళాజాతా బృందాల వారు ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జానపద పాటలతో మత్తు పదార్థాలపై, ట్రాఫిక్ నిబంధనలపై, సైబర్ క్రైమ్‌లపై, ఆత్మహత్యలపై, షీటీంపై, 100 కాల్స్‌పై, 1930కాల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి

మంథని, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో జరిగే వార్డు సభా సమావేశాల్లో ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చునని చైర్ పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్‌లు వేర్వేరుగా ఆదివారం సూచించారు. ప్రస్తుత కులగణన జాబితాలోకి రాని వారు లేదా ఇప్పటికే దరఖాస్తులు సమర్పించిన వారి పేర్లు జాబితాలో లేని వారు వార్డు సమావేశాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. ప్రజావాణిలో వచ్చిన అన్ని దరఖాస్తులను కూడా అర్హత ప్రమాణాల ప్రకారం పరిశీలిస్తారన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను జారీ చేస్తుందన్నారు.

● సుల్తానాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల కోసం ప్రజలు ఆయా గ్రామాలలోని గ్రామపంచాయతీల్లో, మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు ప్రజలకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఆహార భద్రత కార్డుల జారీ, ఇందిరమ్మ గృహాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేల గురించి సమీక్షించారు. ఇప్పటివరకు సుల్తానాబాద్ మండలంలో కొత్త రేషన్ కార్డుల కోసం 1049 మంది, రేషన్ కార్డులు కలిగి ఉండి అందులో కుటుంబ సభ్యులను చేర్చుకొనేందుకు 1830 మంది మొత్తం కలిసి 2879 మంది లబ్ధిదారుల జాబితా మండల పరిషత్‌కు చేరిందని తెలిపారు. ఎవరూ పేరు లేదని ఆందోళన చెందవద్దని, కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో అర్హులందరికీ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు. ఇప్పటివరకు వచ్చిన జాబితాలో పేర్లు లేని వారు కూడా దరఖాస్తులు సమర్పించాలని వారి దరఖాస్తులు పరిశీలించి సర్వే చేయించి రేషన్‌కార్డుల మంజూరు చేయించామన్నారు. దీనిని అర్హులందరూ వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.